


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

**"ఊహించలేదు గురూగారూ..**'తండ్రి' అని అరిచి పడిపోయాడు. అంతకుముందు నడవడం కూడా యీ గుడితో అతనికి అత్యంత పరిచయం వున్నట్టు నడిచాడు. దుకాణాల మధ్యనించి నడుస్తూ 'నా చిన్నతనంలో మూడో నాలుగో వుండేవి. ఇన్ని దుకాణాలూ, ఇంత రష్షా?' అని ఆశ్చర్యపోయాడు. అతన్ని తోపుడు బండిమీద తీసుకొచ్చి రూంలో పడుకో బెట్టగానే,

'నువ్వు చూడాలనుకున్న విలియమ్స్ నేనే' అంటూ ఆ తెల్ల ముసలాడు వచ్చి నా మోకాలు మీద చెయ్యి ఆన్చాడు. బాబోయ్ మంచులాంటి చెయ్యి. మంచులాంటి చూపు" వణుకుతూ అన్నాడు శ్రీనివాస్.

పరమేశ్వర శాస్త్రిగారు, జయదేవ్, సుదర్శన్‌లు ఆ గదిలో వున్నారు. జయదేవ్ స్నేహితుడి గెస్ట్ హౌస్‌కే 'రాబీ'ని తెచ్చారు. స్పృహలేని స్థితిలోనే. 36 గంటల తరవాత శ్రీనివాస్‌కి స్పృహ వచ్చింది. అంటే, మాటల్లో ఉన్మత్తత తగ్గి, ఏం మాట్లాడుతున్నాడో అర్ధమవుతోంది.

"రాబీ సంగతి ఏం చేద్దాం అతని అన్నకి కబురు చెయ్యనా?" అడిగాడు జయదేవ్.

"అతను వచ్చి మాత్రం ఏం చెయ్యగలడు? రాబర్ట్ ఇక్కడికి రావడానికి అతని ప్రమేయం ఏ మాత్రమూ లేదు. పోవడానికి కూడా వుండదు. జయదేవ్.. రాబర్ట్ గత జన్మల మూలం ఇక్కడున్నది. లోకంలో ఏ కారణమూ లేకుండా ఏదీ జరగదు. ఒక కార్యం మొదలయింది. అది మనం సంకల్పించినది కాదు. ఆ కార్యం పూర్తయ్యేవరకూ రాబీకి విముక్తి లభించదు. ఇది నిజం" చూపుని రాబీ మీదనించి కదల్చకుండా అన్నారు పరమేశ్వర శాస్త్రి.

"ఇతనికి ఏమైనా జరగకూడనిది జరిగితే?" సందిగ్ధంగా అన్నాడు జయదేవ్.

"జరగదు. ఆ విలియమ్స్ అనబడే ఆత్మ విషయం పూర్తిగా ముందు మనం తెలుసుకోవాలి. రాబీ చేత అతను ఏం చేయించాలనుకున్నాడో పసిగడితే, యీ సమస్యకి ఒక దారి దొరికినట్లే" వివరించారు పరమేశ్వర శాస్త్రి.

"అసలు సమస్య ఏమిటి?" ప్రశ్నించాడు శ్రీనివాస్.

"నువ్వడిగినది నూరుపాళ్ళూ నిజమైన ప్రశ్న... అసలు సమస్య ఏమిటి?" పకపకా నవ్వారు శాస్త్రిగారు.

ఆ నవ్వు శ్రీనివాస్ అమాయకపు ప్రశ్నకి నవ్విన నవ్వుకాదు. లోతుగా ఆలోచిస్తే అసలు సమస్య ఏమిటి? అని అయోమయంగా నవ్విన నవ్వు అది.

"బావా... ఏం జరుగుతోందో నాకేం తెలియడంలేదు. నువ్వు ధ్యానంలో గడుపుతున్నావు. వాళ్ళిద్దరూ వాకిట్లో కూర్చుని ఏదేదో మాట్లాడుకుంటున్నారు. నాకేమో పీడకలల మీద పీడకలలు. అసలు ఏం జరుగుతోందో చెప్పవా?" బేలగా అడిగింది మధుర.

"కంగారు వద్దు మధురా! నేనున్నాను. నీకేమీ అపకారం జరగదు. నన్ను నమ్ము" అనునయంగా అన్నాడు రామజోగి.

"అపకారం జరుగుతుందన్న భయంకాదు బావా. చావొస్తుందని తెలిసినా భయముండదు. ఏదీ తెలియనప్పుడేగదా భయమూ, సంశయమో ఆందోళనో" దీనంగా అన్నది మధుర. శృంగి, మట్టు వచ్చిన రాత్రి నించీ ఆమెకి పీడకలలే. కలలనిండా గాండ్రిస్తున్న పులులూ గర్జిస్తున్న సింహాలూ, పడగలెత్తి ఆడుతున్న మహా సర్పాలు.

"పిచ్చీ.. బెంబేలు పడకు. లోకంలో మంచికీ చెడుకీ ఓ మహా సంగ్రామం ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. దీన్నే సురాసుర యుద్ధం అంటాం. పురాణవైరమనీ అంటాం. సత్వగుణ సంపన్నులు దేవతలు. వీళ్ళు మనుషుల్లోనివారే. అలాగే, తమోగుణం అధికంగా కలిగిన వారు రాక్షసులు. వీళ్ళూ మనుషులే. వీళ్ళకేం బానపొట్టలూ కోరలూ కత్తుల్లాంటి గోళ్ళూ అవీ వుండవు. మనలాగానే వుంటారు. అయితే బొమ్మల్లో అంత వికృతంగా ఎందుకు చిత్రీకరిస్తారంటే, వారి ప్రవృత్తి అటువంటిది గనక. మధురా, మంచికీ చెడుకీ మధ్య మరో యుద్ధం మొదలైంది. ఇది వ్యవస్థకి సంబంధించిన యుద్ధం కానీ, వ్యక్తికో, వ్యక్తులకో సంబంధించిన యుద్ధం కాదు" ఆగాడు రామజోగి.

"ఆ యుద్ధంతో నీకేం సంబంధం?" అడిగింది మధుర.

"ఆ విషయం చెప్పాలంటే అంత తేలికకాదు. సరే. నువ్వు ఈ రంగనాయకులకీ శ్రీ వర్ధినికీ ఎందుకు పుట్టావు... లోకంలో కోటానుకోట్ల మంది వుండగా? నీ తండ్రి ఓ గొప్ప సంస్థానాధీశుడు. కనీసం ఆరువేల ఎకరాల సుక్షేత్రం, లెక్కలేనంత గో సంపదా, లెక్కలేనంత వెండీ, బంగారం, నవరత్నాభరణాలు అన్నీ సమృద్ధిగా వుండగా, ఒంటరిగా దిక్కూ మొక్కూ లేని యీ పల్లెలో ఎందుకున్నావూ, దీన్నే అంటాం ప్రారబ్ధం అని ప్రతిమానవ జన్మకీ ఒక స్పష్టమైన కారణం వుంది. వాడు యోగ్యుడో, అయోగ్యుడో బుద్ధి జీవి అనేది నిజం. వాడి పుట్టుకతోనే మరణమూ జన్మిస్తుంది. మధురా, యీ శరీరాలు కేవలం వాహనాల వంటివి మాత్రమే. వీటిని నడిపేవాడు 'శ్వాసరూపంలోనూ ప్రాణరూపంలోనూ ఇందులో ప్రవేశించే పరమాత్మే. ప్రశాంతంగా వుండు. ఎన్ని లక్షల మబ్బులైనా ఆకాశాన్ని జయించలేవుగా! మనసు కుదుటపరచుకో. మబ్బుల్లాంటి ఆలోచనలకి విశ్రాంతి నివ్వు." లాలనగా మధుర తల నిమురుతూ అన్నాడు రామజోగి. ఓ చెప్పలేని ప్రశాంతం ఆమెని అలముకొన్నది. అతని భుజం మీద తలవాల్చి కళ్ళు మూసుకున్నది.

"అయ్యో... మరో రెండు గంటల్లో ఇతనికి తెలివి రావొచ్చు."

పరమేశ్వర శాస్త్రిగారి ఆదేశం ప్రకారం గవ్వలు విసిరి, లెక్కలుగట్టి అన్నాడు సుదర్శన్ భట్.

"మంచిది. తగినంత ఆహారం సిద్ధం చేయించు జయదేవ్. అతన్ని ఏ ప్రశ్నా అడగొద్దు. అతనంతటతన్ని మాట్లాడనిద్దాం." సన్నగా అన్నాడు పరమేశ్వర శాస్త్రి.

"డిన్నర్‌తో బాటు డ్రింక్స్.." ఆగాడు జయదేవ్.

"వాటినీ తెప్పించు. ముందు అతనికి కావాల్సింది ఆహారం... అదీ అతనికి ఇష్టమైనది." నవ్వారు పరమేశ్వరశాస్త్రి. జయదేవ్ శ్రీనివాస్ వంక చూశాడు శ్రీనివాస్ అర్థమైనట్టు తలాడించి బయటకు వెళ్ళాడు.

తిరుపతిలోనే నివశిస్తున్న ఓ ఆంగ్లేయ కుటుంబం వద్ద డ్రింక్స్ స్టాకులో వుంటాయని అతనికి తెలుసు. ఆ యూరోపియన్ పేరు మైకేల్ డికెన్స్, భార్యపేరు మెరిల్ డికెన్స్. ఛార్లెస్ డికెన్స్‌కి బంధువులమని చెప్పుకుంటారు వారు.

రెండున్నర గంటల తరవాత లేచాడు రాబీ. కళ్ళు తెరవగానే అతనికి కనిపించింది జయదేవ్.

"హలో జై.. హౌవ్ ఆర్యూ.." ఉల్లాసంగా అన్నాడు రాబీ.

"నేను పెర్‌ఫెక్ట్... హౌ ఆర్యూ" నవ్వుతూనే సమాధానమిచ్చాడు జయదేవ్. బెడ్ మీంచి లేచే ప్రయత్నం చేస్తూ చుట్టూ చూశాడు రాబీ. అప్పుడు కనపడ్డారు అతనికి పరమేశ్వర శాస్త్రీ, సుదర్శన్, శ్రీనివాస్.

"ఇదేంటీ? ఇక్కడున్నాను? శ్రీనివాస్, మనం గుళ్ళో కదా వున్నదీ" అయోమయంగా అడిగాడు.

"అవన్నీ మెల్లగా చెబుతాను. ప్రస్తుతం ఎలా వుంది నీకూ?"

"నాకసలు ఏమయిందీ? అవునూ వీరెవరూ?" పరమేశ్వర శాస్త్రిగారిని చూస్తూ జయదేవ్‌ని అడిగాడు రాబీ.

"నాడీశాస్త్రం గురించి ఒకరిని నువ్వు అడిగావు కదా.. ఆయనే వీరు. ముందు కొంత ఆహారం తీసుకో. తరవాత తీరిగ్గా మాట్లాడదాం" అని శ్రీనివాస్ వైపు చూశాడు జయదేవ్.

"మనం కాసేపు అవతలి గదిలో కూర్చుందాం. వారు ప్రశాంతంగా భోజనం కానిస్తారు. మిస్టర్ రాబీ డ్రింక్స్ కూడా వున్నాయి" అన్నాడు సుదర్శన్.

"అదేం.. నేను ఒక్కడ్నే ఎందుకూ? అందరం తిందాం. జయ్ డోంట్యూ వాంటూ గివ్ కంపెనీ" లేచి నిలబడి అన్నాడు రాబీ.

"మేం తినేశాం. నువ్వు కానివ్వు. విషయాలన్నీ నువ్వు తిన్నాక చెబుతాను" రూమ్ నించి బయటికి నడుస్తూ అన్నాడు జయదేవ్. మిగతావాళ్ళు జైని ఫాలో అయ్యారు.

"అతనికేదీ జ్ఞాపకంలేదు. జ్ఞాపకం వున్నదల్లా గుడిలో వుండటం. అంతేగానీ దేవుడ్ని చూసిన మరుక్షణం "తండ్రీ" అని అరుస్తూ స్పృహతప్పటం జ్ఞాపకం లేదు. అంతకు ముందు మాట్లాడిన తన చిన్న తనం గురించీ, గుడి పరిసరాలగురించీ కూడా అతనికి గుర్తులేదు" ఆలోచిస్తూ అన్నాడు శ్రీనివాస్.

"అవును. అంతేకాదు గత జన్మగురించి తెలుసుకోవాలనే తీవ్రమైన కోరిక అతనికి వుంది. శాస్త్రిగారిని పరిచయం చేసినప్పుడు కూడా అతనికి ఆ విషయం గుర్తుకురాలేదు" జయదేవ్ అన్నాడు. అతనికీ పరిస్థితి ఇబ్బందిగా వుంది.

"ఒక షాక్ తగిలాక కొంత గతం మరుగున పడవచ్చు. రాబీ అంత తీవ్రమైన షాక్‌కి గురైనట్లు లేదు. ఉల్లాసంగానే ఉన్నాడు. బహుశా కొన్ని గంటల తరవాత అతనికి జరిగిందంతా జ్ఞాపకం రావొచ్చు. రాకపోనూ వచ్చు చిన్నగా అన్నారు పరమేశ్వర శాస్త్రి. చాలాసేపు మౌనం వికృత నాట్యం చేసింది. వికృతం ఎందుకంటే ఏ ఆలోచనా స్పష్టంగా లేదు. అసలు అక్కడి వాతావరణమే పరమ సందిగ్ధంగా, ఏదో విషాదం అలుముకోబోతున్నట్టుగా వుంది. తెలీని ఓ ఆందోళన అందరి మనసుల్లోనూ వుంది.

"అయితే నీకేమీ గుర్తులేదా రాబీ" మూడోసారి అడిగాడు జయదేవ్.

"ఉహూ.. శ్రీనివాస్ ఓ గుడికి తీసికెళ్ళినట్టు గుర్తు. అంతే" రిలాక్స్‌డ్‌గా అన్నాడు రాబీ.

"మిస్టర్ రాబీ.. నేను విలియమ్స్‌ని చూశాను. మీరు వర్ణించినట్టే కోల్డ్ లుక్స్. అతని చెయ్యి నాకూ కాలి మీదపడగానే భయంకరమైన చల్లదనం. భయంతో ఒణికిపోతూ ఆ తరవాత ఓ కల"

రాబీతో అన్నాడు శ్రీనివాస్ సడన్‌గా ఓ అతి శీతల పవనం ఆ గదిలోకి వచ్చింది. ఎంత చల్లదనం అంటే, చెప్పలేనంత. వెన్ను జలదరించేంత చల్లదనం.

"సుదర్శన్.. ఓ ఆత్మ ఇక్కడికి వచ్చింది. గవ్వలు వెయ్యి" చిన్నగా అన్నారు పరమేశ్వర శాస్త్రి.

"ఏమని ప్రశ్నించేది?" అడిగాడు సుదర్శన్.

"మూడు గవ్వలు వెయ్యి. స్వదేశీయులైతే ఒకటి, విదేశీయులైతే రెండు, దేశం ఏదయినా మిత్రులయితే మూడు" అన్నారు శాస్త్రిగారు.

వేశాడు సుదర్శన భట్టు. గవ్వలు గిరగిరా చాలాసేపు తిరిగాయి. చివరికి రెండు గవ్వలు వెల్లకిలా పడ్డాయి.

"ఓహో.. వచ్చింది విలియమ్స్ కావచ్చు. సరే.. వారికి ఏం కావాలో ఎందుకొస్తున్నారో తెలియాలి. ఎవరితో సంభాషించగలను అనుకుంటున్నారో తెలియాలి. గవ్వలు వద్దులే. ఆయన ఎవరినైనా స్పృశించి తనకి కావాల్సింది చెప్పొచ్చు" గాలిలోకి చూస్తూ ఇంగ్లీషులో అన్నాడు పరమేశ్వర శాస్త్రి.

ఇందాక వేసిన మూడు గవ్వల్లో బోర్లాపడ్డ గవ్వ దానంతట అదే గిరగిరా తిరిగి వెల్లకిలా పడ్డది. గదినీ గదిలోని వారినీ ఒణికించిన శీతల పవనం మెల్లగా మాయమైనట్టు అనిపించింది. రెండు నిమిషాల తరవాత యధాతథంగా 'ఉక్కపోత' ప్రారంభమయింది.

"దీనికి అర్థం ఏమిటో గురూజీ" అయోమయంగా అడిగాడు జయదేవ్.

"తెలియచెప్పే పరిస్థితులు ఇంకా రాలేదని."

నిట్టూర్చి అన్నారు పరమేశ్వరశాస్త్రి. ఏదో వేదనా ధ్వని ఆ స్వరంలో కలగలిసిందని సుదర్శన్‌కి అనిపించింది.

"మైర్ ఇప్పుడు ఏం చెయ్యాలి?" అడిగాడు జయదేవ్.

"శ్రీనివాస్.. విలియమ్స్ నీతో ఏమన్నా మాట్లాడాడా?"

సడన్‌గా పరమేశ్వర శాస్త్రి శ్రీనివాస్‌ని అడిగారు.

"అదెలా?" అడిగాడు సుదర్శనభట్టు.

"ఇందాక రాబీకి గతం గుర్తు చెయ్యాలనే ప్రయత్నంలో శ్రీనివాస్ అన్నాడు, తను విలియమ్స్‌ని చూసినట్టూ, అతని చేయి తగలగానే చలితోనూ భయంతోనూ ఒణికినట్టూ" చెప్పారు శాస్త్రిగారు.

"ఓహ్... అవును.. ఆ సంగతి నేను మర్చిపోయా" తెల్లమొహం వేసి అన్నాడు జయదేవు.

"నేనూ అదేగా చేసింది" నుదుటిమీద కొట్టుకుని అన్నాడు సుదర్శన్.

ఓ క్షణం కళ్ళు మూసుకున్నాడు శ్రీనివాస్. రాబీని గదిలో అంటే, మయూరా హోటల్లో పడుకోబెట్టినప్పుడు డా.టివిన్‌కి ఫోన్ చెయ్యబోతుండగా విలియమ్స్‌లోపలికి రావడం గుర్తొచ్చింది. అతన్ని చూడగానే తను ఆగటం, అతను సూటిగా తన కళ్ళల్లోకి ఓ కోల్డ్‌లుక్ ప్రసరించడం గుర్తొచ్చాయి శ్రీనివాస్‌కి. తెల్లకి తెల్లవారుఝామున భుజం మీద చెయ్యేసి విలియమ్స్ అన్నాడు "డోంట్ డు దట్ శ్రీనివాస్. రాబీ బాగానే వున్నాడు."

"ప...ప...పడిపోయాడుగా" శ్రీనివాస్‌కి తెలుస్తోంది పెదవులు కదలడం లేదనీ, మాట మాత్రం విలియమ్స్‌కి చేరిందనీ.

"పడిపోలేదు. నేనే పడగొట్టాను. అతన్ని నా అధీనంలోకి తీసుకున్నాను. నా అంతటన నేను అతన్ని వదిలేవరకూ లోకంలోని ఏ శక్తీ అతన్ని స్పృహలోకి తేలేదు."

ఓ కోల్డ్ స్మైల్ ఇచ్చాడు విలియమ్స్. ఆ నవ్వు ఎలావుందంటే మనిషిని నిట్టనిలువుగా కోసిపారేసేంత షార్ప్‌గా వుంది. శ్రీనివాస్ ఒణికిపోయి బయటికి పారిపోబోయాడు.

"నో" మోకాలు పట్టి మంచం మీదకి విసిరేశాడు విలియమ్స్. అంతే. కదలలేకపోయాడు.

"ఏం..ఏం...కావాలి" అడిగాననుకున్నాడు శ్రీనివాస్.

"నువ్వేగా నేను కనపడితే నీకు కావల్సింది అడుగుతాననీ! అడుగు మై డియర్ శ్రీనివాస్.. అడుగు.. ఏదన్నా ఇస్తా.. అయితే ఒక్కటే ఒక్క కండిషన్.

నాకూ ఇష్టం వచ్చినప్పుడు నేను నీ శరీరంలోకి దూరి నా పనులు చేసుకోవడానికి నువ్వు ఒప్పుకోవాలి." కోల్డ్‌గా నవ్వాడు విలియమ్స్.

"రాబీని లోబరుచుకున్నావుగా.!" భయంగా అన్నాడు శ్రీనివాస్.

"అదివేరు.. ఇదివేరు. రోజుకి ఒక్కగంట... నీ శరీరాన్ని ఉపయోగించి నా పనులు చేసుకునే మాట ఇవ్వు. నువ్వేది కావాలంటే అది ఇస్తా" మోకాలిమీద చెయ్యివేసి అన్నాడు విలియమ్స్.

"నో" అరిచానని అనుకున్నాడు శ్రీనివాస్.

"హ...హ.. నీ శరీరంలోకి ప్రవేశించాలంటే నాకు నీ అనుమతి అవసరంలేదు మిస్టర్. అయితే అప్పుడు ద్వంద్వప్రవృత్తులుంటాయి. సరే.. ప్రస్తుతానికి అక్కర్లేదు. ఇప్పుడు చెప్పిందంతా నీకు గుర్తుండదు" అంటూ మెడమీద నొక్కాడు విలియమ్స్.

"అయ్యో.. నాకు గుర్తున్నది అంతే. అసలు రాబీ విషయం డాక్టర్‌కి ఎవరు చెప్పారో కూడా నాకు తెలీదు. నాకేదీ గుర్తుండవని విలియమ్స్ అన్నాడు గదా.. మరి అందంతా నాకెందుకు గుర్తొచ్చిందీ?" అయోమయంగా అడిగాడు శ్రీనివాస్.

"విలియమ్స్ మనకి మిత్రుడూ కాదు, శత్రువూ కాదు. కనీసం ప్రస్తుతానికి శత్రువు కాదు. అతను ఆధీనంలోకి తీసుకోవాలనుకున్నదీ, తీసుకున్నదీ రాబీని. నిన్నుకాదు. అసలు అదంతా ఇప్పుడు ఎందుకు గుర్తొచ్చిందంటావా? అది నాకూ తెలీదు. కానీ, ఆ విషయం మనందరికీ తెలియాలని విలియమ్స్ ఉద్దేశ్యం కావచ్చు. ఏదేమైనా, రాబీ ఇంకా విలియమ్స్ మనో పరిధిలోనే వున్నాడు. చూద్దాం" తల పంకించి అన్నారు శాస్త్రిగారు.

పనిమనిషి నేతి ప్రమిదలు వెలిగించి అన్ని గదుల్లో పెట్టడానికి తెచ్చింది. ఆమె వెనుక ఓ పనివాడు సాంబ్రాణి పొగ వేస్తూ వచ్చాడు. అలా నేతి ప్రమిదలు పెట్టాలనీ, సాంబ్రాణీ అగరువత్తులు ప్రతి గదిలోనూ రాత్రిళ్ళు వుంచాలనీ చెప్పింది పరమేశ్వర శాస్త్రిగారే.

మెల్లగా అందరూ తమతమ పక్కల వద్దకు వెళ్తుండగా ఓ తీతువు పిట్ట మరోసారి వేదనాభరితంగా కూసింది. శ్రీనివాస్ వెన్ను భయంతో జలదరించింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*